పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- మాజీ సర్పంచ్‌ల డిమాండ్
- గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేత

మహబూబాబాద్ రూరల్/ కేసముద్రం, డిసెంబర్ 27 : రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని మాజీ సర్పంచ్‌ల ఫోరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోడ లక్ష్మణ్ నాయక్ డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పట్టణంలోని గాంధీ విగ్రహానికి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి గతంలో అనేక కార్యక్రమాలు చేసినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచ్‌లపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ బిల్లులు ఇవ్వడంలేదన్నారు. పెండింగ్ బిల్లులు రాక అనేక మంది మాజీ సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకుంటున్నా ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందన్నారు. వెంటనే మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పంజాల సాయిలు, ఆంగోత్ కిషన్‌నాయక్, గుగులోత్ రెడ్యా, దామునాయక్, రామచంద్రు, గుట్టయ్య, వెంకటరెడ్డి, వెంకన్న, భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు. కేసముద్రం మండలంలోని మాజీ సర్పంచ్‌లు శుక్రవారం స్థానిక గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు పరిష్కరించేందుకు, అభివృద్ధి పనులకు ప్రభుత్వం డబ్బులు ఇవ్వకున్నా తాము అప్పులు తెచ్చి చేశామని తెలిపారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. మాజీ సర్పంచ్‌లు ఎన్నమల ప్రభాకర్, హుస్సేన్‌నాయక్, బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు ఘనపురపు రమేశ్, సింగిల్ విండో డైరెక్టర్ కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు రాజు ఉన్నారు.

మహబూబాబాద్ రూరల్: గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్‌లు

కేసముద్రం: గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్‌లు

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

మాజీ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు, డిసెంబర్ 27: అధైర్యపడొద్దని.. ఆపదలో ఉన్న కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శుక్రవారం మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కడెం రాజాలు కుమారుడు హరీశ్ క్వారీలో పడి మృతిచెందాడు. పార్థివదేహంపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ.. అన్ని విధాలా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. క్వారీ యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

వధూవరులకు ఆశీర్వాదం

పెద్దవంగర: మండలంలోని లొట్లబండ తండా జీపీ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు జాటోత్ పూల్‌సింగ్– తారా దంపతుల కుమారుడు మహేశ్ – దేవి వివాహ వేడుకలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం హాజరై వధూవరులను ఆశీర్వదించారు. పాలకుర్తి దేవస్థానం మాజీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ, బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి సంజయ్, సోమనర్సింహారెడ్డి, సుధీర్‌కుమార్, విజయ్‌పాల్‌రెడ్డి, వెంకన్న, రాము, రఘు, పటేల్‌నాయక్, రవి, అశోక్, నవీన్, రవి, అనుదీప్ పాల్గొన్నారు.

మరో ఆరు కొత్త పంచాయతీలు!

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన అధికారులు

కొత్త జీపీల మ్యాపులు సిద్ధం చేస్తున్న సర్వేయర్, సెక్రటరీ

బయ్యారం, డిసెంబర్ 27: మండలంలో మరో కొత్త ఆరు గ్రామ పంచాయతీల ఏర్పాటు కోసం అధికారులు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. గతలో పది గ్రామ పంచాయతీలు ఉండగా కేసీఆర్ ప్రభుత్వంలో 500 జనాభా కలిగిన తండాలు, గూడెంలను జీపీలుగా ఏర్పాటు చేయగా 18 ఏర్పడి, ప్రస్తుతం మొత్తం 29 ఉన్నాయి. పాలన సౌలభ్యం కోసం మరో ఆరు పంచాయతీల కోసం అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. మిర్యాలపెంట పంచాయతీలో సంభతండా, పత్యతండా, బోటితండాలు కలిపి ఒక జీపీ, ఉప్పలపాడు పంచాయతీలోని గొల్లగూడెం, జగన్నాథపురం కలిపి ఒక జీపీ, బయ్యారం పంచాయతీలో చెన్నంగలగడ్డ, కోటగడ్డను కలిపి ఒక జీపీ, గౌరారం పంచాయతీ పరిధిలోని వినోభానగర్, కోడిపుంజుల తండా, వెంకట్రాంపురం జీపీలోని చొక్లతండాలను మూడు మొత్తం ఆరు జీపీల ఏర్పాటుకు సంబంధించిన మ్యాపులను అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

చిన్నగూడూరు పీఎస్ తనిఖీ చేసిన డీఎస్పీ కృష్ణకిషోర్

స్టేషన్‌లో సామగ్రి పరిశీలిస్తున్న డీఎస్పీ కృష్ణకిశోర్

చిన్నగూడూరు, డిసెంబర్ 27: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో పోలీస్ సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని తొర్రూర్ డీఎస్పీ కృష్ణకిశోర్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, నిషేధిత వస్తువుల విక్రయాలను కట్టడిచేయాలన్నారు. గ్రామాల్లో అసంఘటిత కార్యకలాపాలు, అపరిచిత వ్యక్తుల సంచారం ఉంటే వెంటనే 100కు డయల్ చేయాలన్నారు. సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సై ఝాన్సీ ఉన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

మల్లేశ్వర్(ఫైల్)

చిన్నగూడూరు, డిసెంబర్ 27: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని జయ్యారం రెవెన్యూ పరిధిలోని మేగ్యా తండాలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాదావత్ మల్లేశ్వర్(45) కుటుంబ కలహాలతో శుక్రవారం మధ్యాహ్నం పురుగులమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని వైద్యం కోసం జిల్లా కేంద్రానికి తరలించారు. చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బైక్‌లు ఢీకొని ఒకరు మృతి

గూడూరు, డిసెంబర్ 27: ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలైన ఘటన శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన బొడ్డుపల్లి లింగయ్య(45) గూడూరుకు వ్యక్తిగత పని కోసం బైక్‌పై వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. గాజులగట్టుకు చెందిన పేరాల మనోజ్‌కుమార్ బైక్‌పై గూడూరు వైపు వస్తుండగా తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. క్షతగాత్రులను వెంటనే స్థానికులు సీహెచ్‌సీకి తరలించగా ప్రథమ చికిత్స తర్వాత మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఓ దవాఖానకు తరలించారు. లింగయ్య చనిపోయినట్లు బ్రహ్మణపల్లి గ్రామస్తులు తెలిపారు. మనోజ్‌కుమార్ తలకు తీవ్రగాయాలైనట్లు గాజులగట్టు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌రావు

సాగునీరు అందించాలి

గార్ల, డిసెంబర్ 27: సీతారామ ప్రాజెక్టు ఫేస్ వన్ పనులు చేసి, గార్ల, బయ్యారం, కారేపల్లి, కామేపల్లి మండలాలకు సాగునీరు అందించాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణంతో రైతులకు సాగునీరు అందుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలన్నారు. రాంపురం పాకాల ఏటిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. నాయకులు తారక మురళీ రామారావు, రవీందర్ నాయక్, రాజేందర్ పాల్గొన్నారు.

ప్రజా పాలన అంటూనే అన్యాయం

సంఘీభావం తెలుపుతున్న జిల్లా దివ్యాంగ సంఘం నాయకులు

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 27 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అంటూనే అన్యాయం చేస్తోందని దివ్యాంగుల సంఘం రాష్ట్ర నాయకుడు హనుమంతు అన్నారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సెంటర్‌లో సమగ్ర శిక్షా ఉద్యోగులకు సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లుగా విద్యాశాఖలో చాలీచాలని వేతనాలకు పనిచేస్తున్న వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించటం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అనేక వాగ్దానాలు చేసి, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. మహంకాళి వీరన్న, ఉపేందర్, వెంకన్న పాల్గొన్నారు.

స్పందించకుండా.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లా?

నెల్లికుదురు: తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని 21 రోజులుగా సమ్మె చేస్తుండగా ప్రభుత్వం స్పందించకుండా ప్రత్యామ్నాయంగా వారి స్థానంలో ప్రభుత్వ ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపాలని నిర్ణయించడం దుర్మార్గమని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సంగ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 18ఏళ్లుగా ఎస్ఎస్ఏలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు చాలీచాలనీ వేతనాలతో విధులు నిర్వర్తిస్తూ విద్యాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల స్థానాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయుల డిప్యూటేషన్ చర్యను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి

గార్లలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 27 : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నివాళులు అర్పించారు. మహబూబాబాద్ పట్టణంలోని కేటీఆర్ నగర్ కాలనీలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కోండ్ర ఎల్లయ్య ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పులి శ్రీను, రాధ, బాలరాజు, సాంబయ్య, యాదగిరి, యశ్వంత్ పాల్గొన్నారు. గార్ల మండలకేంద్రంలో మన్మోహన్‌సింగ్‌కు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఘనంగా నివాళులర్పించారు. మన్మోహన్‌సింగ్ ఆశయాలను కొనసాగించాలన్నారు. చిన్నగూడూరులోని దాశరథి సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేసముద్రం మార్కెట్‌లో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి మాట్లాడారు. దంతాలపల్లిలోని అంబేద్కర్ సెంటర్‌లో మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నెల్లికుదురు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మౌనం పాటించారు.

వేతనాలు వెంటనే ఇవ్వాలి

- జీపీ కార్మికుల డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా టోకెన్ సమ్మె
- మద్దతు తెలిపిన పలు సంఘాలు

తొర్రూరులో జీపీ కార్మికులతో కలిసి నిరసన తెలుపుతున్న టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు రవి

తొర్రూరు/ డోర్నకల్/ చిన్నగూడూరు/ మరిపెడ/ ఇనుగుర్తి/ కేసముద్రం/ మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 27: పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలనే డిమాండ్‌తో గ్రామ పంచాయతీ కార్మికులు శుక్రవారం టోకెన్ సమ్మెకు దిగారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ అనుబంధ హెచ్–106), సీఐటీయూ, జీపీ కార్మికులు, ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనకు దిగారు. తొర్రూరులోని అమరవీరుల స్థూపం వద్ద జీపీ కార్మికులు నిరసన తెలిపారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ అనుబంధ హెచ్–106) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికుల ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం జీపీ కార్మికుల సమస్యలను పట్టించుకోవటం లేదని మండిపడ్డారు. పది నెలలుగా వేతనాలు అందక అప్పులు తెచ్చుకొని కుటుంబాలను పోషించుకుంటున్న వారు పట్టణాలకు వలసపోతున్నారని తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాడి యాబీకు, మండల అధ్యక్షుడు సోమనర్సయ్య, మండల నాయకులు యాకయ్య, రాము, వెంకట్, యాకయ్య, నరసయ్య, మహేశ్, మురళి పాల్గొన్నారు.

డోర్నకల్ ఎంపీడీవో కార్యాలయం ముందు జీపీ కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి టోకెన్ సమ్మె నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి దాసరి మల్లేశం మాట్లాడుతూ ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీపీ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. ఇన్సూరెన్స్ ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. జీపీ కార్మికుల మండల అధ్యక్షుడు ముదాకర్, ఉపాధ్యక్షుడు గణేశ్, రామకృష్ణ, దాసు పాల్గొన్నారు.

చిన్నగూడూరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జీపీ కార్మికులు సమ్మె శిబిరంలో వారి సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఆది బాబు, వెంకన్న మాట్లాడారు. జీపీ కార్మికులను 2వ పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలన్నారు. జీవో నంబర్ 51ని సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని నరసన తెలిపారు. సంఘ బాధ్యులు ఉపేంద్రాచారి, కృష్ణ, ఉపేంద్ర, గణేశ్, కిరణ్, సీతయ్య, శ్రీను, మహేందర్, మమత, పద్మ, నాగమ్మ, సావిత్రి ఉన్నారు.

మరిపెడ ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. రెండు రోజుల సమ్మెను తెలంగాణ జీపీ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు ఎస్‌కే జానీ ప్రారంభించి మాట్లాడారు. జీవో నంబర్ 60 కేటగిరి ప్రకారం వేతనాలు చెల్లించి, జీవో 51ని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. మండల కార్యదర్శి అలవాల యాదగిరి, కోశాధికారి గంగుల మహేశ్, జేఏసీ సభ్యులు వేణు, యాకయ్య, నరేష్, నేతాజీ, రాజు, వెంకన్న పాల్గొన్నారు.

ఇనుగుర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఇనుగుర్తి మండల జీపీ సిబ్బంది సంఘం అధ్యక్షుడు బోళ్ల రాములు ఆధ్వర్యంలో టోకెన్ సమ్మె నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలి మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పింగిలి రజితా శ్రీనివాస్, మాజీ సర్పంచ్ జాటోత్ అరుణా హరిచంద్, లింగాల శ్రీనివాస్, ఎండీ అమీర్ సంఘీభావం తెలిపారు. జీపీ సిబ్బందికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. జీపీ సిబ్బంది బూర యాకలక్ష్మి, ఎల్లయ్య, చంద్రు, ఉమ, పార్వతమ్మ, ఎల్లయ్య, భిక్షం, ఎల్లయ్య, యాకయ్య, నాగన్న, సోమక్క, సుగుణమ్మ పాల్గొన్నారు.

కేసముద్రం మండల పరిషత్ కార్యాలయం ఎదుట శుక్రవారం జీపీ కార్మికులు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు జల్లె జయరాజ్ మాట్లాడారు. జీపీ కార్మికులు జాటోత్ మంగీలాల్, వెంకటేశ్వర్లు, కనకలక్ష్మి, శ్రావణ్, యకమ్మ, వెంకన్న ఉన్నారు.

మహబూబాబాద్ ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జీపీ సిబ్బంది నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ మాట్లాడారు. కారోబార్లకు బిల్ కలెక్టర్లుగా స్పెషల్ హోదా కల్పించాలన్నారు. సుధాకర్, యాలాద్రి, వీరన్న, శౌరి, ఐలయ్య, మంగమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతి

గార్ల: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు సీఐటీయూ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. జీపీ కార్మికుల పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు రామారావు, జాటోత్ ఝాన్సీలక్ష్మి, హతీరాం, రాము, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నెల్లికుదురులో వంటావార్పు

నెల్లికుదురు: జీపీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో కార్మికులు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట మెరుపు సమ్మె నిర్వహించారు. వంటావార్పు చేసి నిరసన తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్మికులకు పెండింగ్ వేతనాలను ఇవ్వాలని, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలి తెలిపారు. బీ.వెంకన్న, యాందు పాషా, విజయ, రాధ, హెచ్చు వెంకన్న, విజయ, మురళి, ఉప్పలయ్య, చంద్రయ్య, వెంకన్న, మల్లయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

కేసముద్రం, డిసెంబర్ 27: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28, 29న సాధారణ సెలవులు, ఈ నెల 30న అమవాస్య సందర్భంగా వరుసగా సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

ఎన్‌డీఆర్ఎఫ్ మాక్‌డ్రిల్

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 27: భారీ వర్షాలు కురిసినప్పుడు వరదల్లో కొట్టుకుపోయిన వారిని రక్షించడంపై పోలీసులు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందం శుక్రవారం పట్టణ శివారులోని కంబాల చెరువులో మాక్‌డ్రిల్ నిర్వహించారు. విజయవాడ నుంచి వచ్చిన బృందంతో వరదలో చిక్కుకున్న వారిని పడవల సాయంతో వెంటనే సురక్షిత ప్రదేశాలకు తరలించే విధానాన్ని ప్రదర్శించారు. నీళ్లలో పడిపోయిన వారికి ధైర్యం చెబుతూ బయటకు తేవడాన్ని చూపించారు. అప్రమత్తతోనే బాధితులను రక్షించవచ్చని ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సభ్యుడు నాగేష్ పేర్కొన్నారు.

నూతన విద్యా విధానాన్ని వెనక్కి తీసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 27 : కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫఐ జాతీయ అధ్యక్షుడు వీపీ సాను అన్నారు. శుక్రవారం పట్టణంలోని పురుమాండ్ల జగన్నాథ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం తీసుకున్న నిర్ణయాలతో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతారని తెలిపారు. వీరభద్రం, పట్ల మధు, సూర్యప్రకాశ్, జ్యోతిబసు, సింహాద్రి, రాజేశ్, చరణ్ పాల్గొన్నారు.

దళిత టీచర్‌పై జరిగిన దాడిని ఖండించాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 27 : రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ బాలుర ఉన్నత పాఠశాల దళిత గెజిటెడ్ హెడ్‌మాస్టర్ కంబాలి రాములుపై మతోన్మాదులు చేసిన దాడిని ఖండించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు చాగంటి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. అతడిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తూ కావాలని దాడి చేశారని, వారిపై వెంటనే కఠినచర్యలు తీసుకోవాలన్నారు. బద్రి, మహేందర్, శ్రీనివాస్, శ్రీను పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించడంలో విఫలం'

కేసముద్రం, డిసెంబర్ 27: కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఏఐసీటీయూ జిల్లా ఇన్‌చార్జి కోనె కుమారస్వామి అన్నారు. జనవరి 5న మండల కేంద్రంలో జరిగే ఏఐసీటీయూ రాష్ట్ర కమిటీ సమావేశాలు విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారులకు తలొగ్గిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని పేర్కొన్నారు. కంచ వెంకన్న, వేల్పుల వెంకన్న, వీరస్వామి, గుగులోత్ రాజు, వీరన్న, కరుణాకర్, లక్ష్మణ్ ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

బయ్యారం: పంపిణీ చేసిన డీఈవో, దాతలు

బయ్యారం/ నెల్లికుదురు, డిసెంబర్ 27: కేజీబీవీల్లో పదో తరగతి విద్యార్థులకు డీఈవో రవీందర్‌రెడ్డి శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. బయ్యారం కేజీబీవీలో కాళోజీ గుడ్‌ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దాతలు తోడేటి వెంకన్న, మామిళ్ల భాస్కర్, సీహెచ్ సాయికుమార్ సహకారంతో, నెల్లికుదురు కేజీబీవీలో ఎడళ్ల యాదవరెడ్డి సహకారంతో అందజేశారు. డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను ప్రణాళికబద్ధంగా చదివి మెరుగైన మార్కులు సాధించాలని సూచించారు. 10 జీపీఏతో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలోనిలుపాలని సూచించారు. బయ్యారంలో మైస శ్రీనివాసులు, ఎంఈవో దేవేంద్రాచారి, ఏసీజీఈ శ్రీరాములు, మహంకాళి బుచ్చయ్య, ప్లానింగ్ కోఆర్డినేటర్ పూర్ణచందర్, రిసోర్స్‌పర్సన్ ఆగుర్తి సురేష్, నెల్లికుదురు ఎంఈఓ ఏ.రాందాస్, ఏసీజీఈ మందుల శ్రీరాములు, ఎఫ్ఏవో మహాంకాళి బుచ్చయ్య, ప్లానింగ్ కో ఆర్డినేటర్ పూర్ణచందర్ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 27 : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నిరుపేదలకు ఇచ్చిన హామీలైన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోకి వెంటనే ప్రభుత్వం నిధులను మంజూరు చేయాలన్నారు. ప్రజలు తాగునీరు, సీసీరోడ్లు, డ్రెయినేజీ, పక్కా భవనాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం నిరుపేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరుపేదల సమస్యలపై ఈనెల 30న మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట భారీ ధర్నా ఉంటుందని, జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సూర్ణపు సోమయ్య, సీతారాం నాయక్, అన్వేష్, గోపీ, వెంకన్న పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ కేసుల పురోగతిపై చర్చ

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 27: జిల్లా కోర్ట్ ప్రాంగణంలో శుక్రవారం హిట్ అండ్ రన్ కేసుల పురోగతిపై రెవెన్యూ డివిజనల్, పోలీస్ అధికారులతో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సురేష్ చర్చించారు. ఈ కేసులపై రెండు నెలలకోసారి చర్చించి తగిన నివేదికను హైకోర్ట్ లీగల్ సర్వీస్